సాక్షి జగిత్యాల

మంగళవారం ၊ 2 ၊ జూలై ၊ 2024



పేదలకు 'ప్రైవేట్' చదువులందేనా?

పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్ల కేటాయింపు, ప్రభుత్వమే ఖర్చులు భరించి, ఉచితంగా చదువు చెప్పించాలనే నిర్ణయం మళ్లీ తెరపైకి వచ్చింది. -8లో



బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఎత్తివేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొడివాతావరణం ఉన్నా.. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా భరణి నక్షత్ర వేడుకలు



ధర్మపురి దేవస్థానంలో అలంకృతుడైన యమధర్మరాజు

ధర్మపురి: భరణి నక్షత్రం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం శ్రీయమధర్మరాజు ఆలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు బొజ్జ రమేశ్ శర్మ, ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణలతో స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకంగావించారు. ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమం, హారతి, మంత్రపుష్పం పూజలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులున్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



బస్‌స్టాండ్‌లో ప్రదర్శన ఇస్తున్న ఆర్టీసీ కళాజాత బృందం

జగిత్యాలటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, మహిళలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోవాలని ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్ సునీత సూచించారు. సోమవారం డిపోలో, బస్‌స్టాండ్‌లో ఆర్టీసీ కళా బృందంతో లక్షేలక్ష్యం కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. డీఎం సునీత బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బస్సుల్లో ప్రయాణించేటప్పుడు మహిళలు తమ సెల్‌ఫోన్లు, బ్యాగులు దొంగిలించకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆర్టీసీ కళాబృందాలు తమ ఆటపాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో జగిత్యాల ట్రాఫిక్ ఇన్‌చార్జి శ్రీనివాస్, కళాబృందం ఇన్‌చార్జి కమల, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్‌యాక్ట్

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల నేపథ్యంలో జిల్లాలో ఈనెల 31వరకు సిటీ పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.

'రైతుభరోసా'పై ప్రభుత్వానికి నివేదిస్తాం

- జిల్లా వ్యవసాయాధికారి వాణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వాణి

రాయికల్: 'రైతుభరోసా'పై రైతుల నుంచి తీసుకున్న వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. సోమవారం మండలంలోని అల్లీపూర్, ఉప్పుమడుగు, రాయికల్ సహకార సంఘాల పరిధిలో రైతుభరోసాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో రైతులు వివరించిన వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు ఏనుగు మల్లారెడ్డి, దీటి రాజిరెడ్డి, సీఈవో రవికుమార్ పాల్గొన్నారు.

పైసా వసూల్..

- మాతాశిశు కేంద్రంలో మందుల అమ్మకాలు
- పేషెంట్ల నుంచి డబ్బులు లాగుతున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

జగిత్యాల: అది జగిత్యాలలోని మాతాశిశు సంక్షేమ కేంద్రం. నిత్యం గర్భిణులు, బాలింతలు వైద్యం కోసం వస్తుంటారు. ఆస్పత్రిలో నెలకు 300కుపైగానే ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో 50శాతం నార్మల్ డెలివరీలు, 50 శాతం సిజేరియన్లు చేస్తుంటారు. డెలివరీకి సంబంధించిన కిట్లతోపాటు మందులు కూడా అందుబాటులోనే ఉంటాయి. వీటిని గర్భిణులు, బాలింతలకు ఉచితంగా ఇవ్వాల్సిన సిబ్బంది కొందరు డబ్బులు లాగుతున్నారు. రహస్యంగా మందులు విక్రయిస్తున్న వైనం 'సాక్షి', 'సాక్షి టీవీ' స్టింగ్ ఆపరేషన్‌లో వెలుగులోకి వచ్చింది. ఉచితంగా ఇవ్వాల్సిన మందులను బయట కొంటే ఎక్కువ డబ్బులు అవుతాయని చెబుతూ పేషెంట్ల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. అందులో పనిచేస్తున్న కొందరు స్వీపర్లను అడ్డుపెట్టుకుని సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

స్వీపర్ల ద్వారా దందా

మాతాశిశు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న కొందరు సిబ్బంది ఉచితంగా ఇవ్వాల్సిన మందులను విక్రయిస్తున్నారని పేషెంట్లే చెబుతున్నారు. మందులకు డబ్బులు తీసుకుంటున్నారని, ఉచితంగా ఇవ్వడం లేదంటున్నారు. బయట కొంటే ఎక్కువ అవుతాయని చెబుతూ ఎంతోకొంత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. డెలివరీ కిట్‌కు రూ.వెయ్యి, మందులకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ఇంత తతంగం జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఓ బాలింతను డిశ్చార్జి చేసినప్పుడు ఆమెను స్ట్రెచర్‌పై తీసుకెళ్లి 102 వాహనంలో ఎక్కించాల్సి ఉంది.



ఆస్పత్రిలో ఓ రోగి బంధువుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బంది

కానీ.. డబ్బుల విషయమో.. మరేఇతర కారణమో గానీ ఆమెను నిటారుగా ఉండే మెట్లపైనుంచి నడిపించుకుంటూ తీసుకొచ్చి 102వాహనంలో ఎక్కించారు. బాలింత అనే కనీస కనికరం చూపలేదని విమర్శలు వచ్చాయి. ఈ విషయంలో వైద్యులు మాత్రం హడావుడిలో ఆమెనే నడుచుకుంటూ వెళ్లిందని చెబుతున్నారు. కేంద్రంలో వైద్యులు సక్రమంగా పట్టించుకోవడం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అన్నిచోట్లా వసూలు

మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ప్రతిదానికీ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. పేషెంట్లకు సంబంధించిన బంధువులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఆస్పత్రిపై నిఘా లేకపోవడంతో అందులో పనిచేస్తున్న సిబ్బంది ఆడిందే ఆటగా మారిందనే ఆరోపణలున్నాయి. జనన, మరణాల ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇచ్చే విషయంలోనూ అమ్యామ్యాలు పుచ్చుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కొత్తగా వచ్చిన కలెక్టర్ సత్యప్రసాద్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఇటీవలే ఆదేశాలు కూడా జారీ చేశారు. వైద్య సిబ్బంది ఎవరినీ పట్టించుకోవడం లేదని ఓ పేషెంట్ ఆందోళనకు కూడా దిగారు. కలెక్టర్ వస్తున్నారని సదరు పేషెంట్‌ను కలెక్టర్‌కు కలవకుండా చూశారంటే సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మాతాశిశు సంక్షేమ కేంద్రంలో జరుగుతున్న డబ్బుల వసూళ్లపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

దృష్టికి వస్తే చర్యలు



డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. పేషెంట్లు నేరుగా వచ్చి మాకు చెప్పాలి. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. గర్భిణులకు సంబంధించినవి అన్నీ ఉచితంగానే ఇస్తారు. ఎవరైనా మందులు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

వైద్యుల పరిరక్షణ బాధ్యత ప్రజలదే



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రాములు

- ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములు

జగిత్యాల: వైద్యుల పరిరక్షణ బాధ్యత ప్రజలదేనని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు అన్నారు. సోమవారం మాతాశిశు సంక్షేమ కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్లు ప్రత్యక్ష దేవుళ్లు అని, వారి బాధ్యత ప్రజలదేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని, ఇప్పటికే జిల్లా మెడికల్ హబ్‌గా మారిందని స్పష్టం చేశారు. 60 రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వెలడించారు. అనంతరం పలువురు వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు శ్రీధర్, నవీన్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, ఆర్ఎంపీ అధ్యక్షుడు చారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- ఎస్పీ అశోక్‌కుమార్
- పోలీస్ గ్రీవెన్స్‌కు స్పందన



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు తరలివచ్చారు. వారి నుంచి ఎస్పీ దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువ చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

లండన్ హైకమిషన్‌లో తెలంగాణ డే వేడుకలు

రాయికల్: లండన్‌లోని సెంట్రల్ భారత హైకమిషన్ కార్యాలయంలో మొట్టమొదటిసారిగా తెలంగాణ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత హైకమిషన్ విక్రమ్ దొరైస్వామి మాట్లాడుతూ మొదటిసారిగా విదేశీ గడ్డపై తెలంగాణ డే వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) సభ్యుల పాత్ర కీలకంగా మారిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టాక్ అధ్యక్షుడు రత్నాకర్, ప్రతినిధులు గణేశ్, నవీన్‌రెడ్డి, హరి, పవిత్ర, సురేశ్, సుప్రజ, స్వాతి, స్నేహ, పృథ్వీ పాల్గొన్నారు.



లండన్‌లో తెలంగాణ డే వేడుకల్లో పాల్గొన్న టాక్ సభ్యులు

గాలికి కొట్టుకుపోయేవి గడ్డిపోచలే..

గడ్డపారలు కావు



మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో బాజిరెడ్డి, విద్యాసాగర్‌రావు, చల్మెడ, నారదాసు, తదితరులు

- గడ్డి పోచలాంటి వ్యక్తి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్
- వియ్యంకుడి బిల్లులు, సొంత క్రషర్ కోసమే కాంగ్రెస్‌లోకి
- జగిత్యాలకు పట్టిన శనిపోయింది
- మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జగిత్యాల: గాలికి కొట్టుకుపోయేవి గడ్డిపోచలేనని, గడ్డపారలు కొట్టుకుపోవని, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గడ్డిపోచలాంటి వ్యక్తి అని, కేవలం తన వియ్యంకుడి బిల్లులు, సొంత క్రషర్ కోసమే ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్లాడని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. జగిత్యాల కార్యకర్తలను చూస్తే ఎంతో సంతోషంగా ఉందని, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పోవడం జగిత్యాలకు శని పోయిందన్నట్లు ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితతో సహా అందరూ కష్టపడితేనే సంజయ్ ఎమ్మెల్యే అయ్యాడని, రేవంత్‌రెడ్డి విసిరిన ఎంగిలి మెతుకులకోసం పార్టీని వీడాడని తెలిపారు. కుండ పగిలితే పగిలిందిగానీ.. కుక్కబుద్ధి తెలిసిందన్నట్లు సంజయ్ బుద్ధి తెలిసిందన్నారు.

అభివృద్ధి కోసం పోయావా..?

'జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానంటున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం జగిత్యాల జిల్లాను రద్దు చేస్తా అన్నందుకు పోయావా..? మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల రద్దుచేస్తాం అన్నందుకు పోయావా..? రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా 4500 డబుల్‌బెడ్ రూంలు రద్దు చేస్తాం అన్నందుకు పోయావా..?' అని కేటీఆర్ ప్రశ్నించారు. సంజయ్‌కి దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కష్టాలు వచ్చినప్పుడే నాయకుల విలువ తెలుస్తుందని, బీఆర్ఎస్ గెలవడం కోసం నాయకులు ఎంతో కష్టపడ్డారని గుర్తు చేశారు. ప్రజలకు అనేక ఆశలు చూపించి.. అలవికాకి హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు ఏ ఒక్కటీ అమలు కావడం లేదన్నారు. వృద్ధులకు రూ.4వేల పెన్షన్, రూ.15 వేల రైతుభరోసా, రూ.2500 మహిళలకు ఇలా 420 హామీలిచ్చి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కాడని, అందులో ఏ ఒక్కటైనా అమలు కావడం లేదని తెలిపారు. ఎన్నికల సమయంలో వారు ఇచ్చిన హామీలపై కార్యకర్తలకు ప్రజంటేషన్ ద్వారా చూపించారు. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి కూడా సొంత పార్టీపై విమర్శలు చేశారన్నారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో చేరితే వారి సభ్యత్వం రద్దు చేస్తామని రాహుల్‌గాంధీ పంచ్‌న్యాయ్ పేరుతో మేనిఫెస్టోలో పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్నెళ్లలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదుగానీ.. అన్ని వర్గాల ప్రజలు మాత్రం ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయలేక ప్రజలు నిలదీస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లోనే ముసలం పుడుతుందని రేవంత్‌రెడ్డి భయపడి ఎమ్మెల్యేలను గొర్రెలు, బర్రెల్లా కొని తన దొడ్డిలో కట్టేసుకుంటున్నాడని ఆరోపించారు. ఇచ్చిన హామీలను డైవర్ట్ చేసేందుకే ఈ తతంగం నడుపుతున్నాడన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ 1.65 లక్షల ఉద్యోగాలు ఇచ్చినా రాహుల్‌గాంధీ బద్నాం చేశారని, కాంగ్రెస్ అధికారంలోకొచ్చి నెలలు గడుస్తున్నా ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని ఇప్పటి వరకు ఏమిచ్చారని ప్రశ్నించారు. ఓయూ విద్యార్థులు నిరసన మొదలు పెట్టారని, మోతిలాల్ అనే విద్యార్థి దీక్ష చేస్తుంటే పరామర్శించేందుకు వెళ్లిన కాంగ్రెస్ ఎమ్మెల్సీని తరిమికొట్టారన్నారు. ఈ ఆరునెలల్లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ తెచ్చింది.. తెలంగాణను అభివృద్ధి చేసింది కేసీఆర్ అని, ఇది చరిత్ర అని, దీనిని చెరిపేస్తే చెరిగిపోదన్నారు. ఒక్కో ఎమ్మెల్యేలను చేర్చుకుంటూ బీఆర్ఎస్ ఖతం అయిందని పుకార్లు పుట్టిస్తున్నాడని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కడతారన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నాడని, కాంగ్రెస్ పార్టీలో జీవన్‌రెడ్డి ఒక ఎంపీటీసీ బీం ఫాం కూడా ఇవ్వనివ్వరని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే పార్టీకి ద్రోహం చేసి వెళ్లిపోయాడని, కార్యకర్తలు ఎప్పుడు వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ ఇక నుంచి జగిత్యాలలో వారంలో నాలుగు రోజులు ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేలా చూస్తానని, కార్యకర్తలు భయపడొద్దన్నారు. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కష్టపడ్డారని, రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, బాజిరెడ్డి గోవర్ధన్, వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మణ్‌రావు, నారదాసు లక్ష్మణ్, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోడు వినండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సత్యప్రసాద్
- వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, చిత్రంలో అదనపు కలెక్టర్లు

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి బాధితులు భారీగా తరలివచ్చారు. బాధితుల నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 44 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, రఘువరణ్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు పులి మధుసూదన్, ఆనంద్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పట్టాలు ఇప్పించండి

40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు చేసి ఇప్పించాలని మల్లాపూర్ మండలం బంజారాతండా గిరిజనులు కలెక్టర్‌కు మొరపెట్టుకుంటున్నారు. గ్రామశివారులోని సర్వే నంబర్ 1040లో ఉన్న భూమిని బంజారతండా గిరిజనులం 40ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, డీ–1 పట్టాల పేరిట రెవెన్యూ అధికారులు భూస్వాములకు ఆ భూములను పట్టా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల 1040లో ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా నిర్ధారణ చేసిన రెవెన్యూ అధికారులు ఆ భూమిలో ఇతరులెవరికీ హక్కులు కల్పించవద్దని సూచించారని, భూపంపిణీ పథకం కింద తమకు పట్టాలు చేసి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

స్కూళ్లలో మరుగుదొడ్ల సమస్య పరిష్కరించండి



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించి మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలి. జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవు. ఉన్న వాటిలో నిర్వహణకు స్కావెంజర్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. – కాయితి శంకర్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

వీడీసీ నుంచి డబ్బులు ఇప్పించండి



పైడిమడుగు వాగులో ఇసుక విక్రయాల పేరిట గ్రామ అభివృద్ధి కమిటీ నా నుంచి వసూలు చేసిన రూ.19లక్షలు ఇప్పించాలి. ఇసుక రవాణాకు ప్రతి ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.300గా నిర్ణయించి బహిరంగా వేలం నిర్వహించారు. గ్రామస్తులతోపాటు నేను వేలంలో పాల్గొని రూ.19లక్షలు అభివృద్ధి కమిటీకి చెల్లించిన. ప్రభుత్వం ఇసుక తరలింపును నిలిపివేసింది. నా డబ్బులు నాకు ఇవ్వాలని కోరితే వీడీసీ సభ్యులు నిరాకరిస్తున్నారు.

– అయిల్నేని జగదీశ్వర్, పైడిమడుగు

బెల్ట్‌షాపులు మూసివేయించండి



పైడిమడుగు గ్రామంలో అక్రమంగా బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారు. యువతను తాగుబోతులు, వ్యసనపరులుగా మారుస్తున్నారు. గుడి, బడి, అంబేద్కర్ విగ్రహం సమీపంలో మద్యం విక్రయిస్తున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బెల్టు, షాపులు మూసివేసి పైడిమడుగు గ్రామాన్ని ప్రశాంత గ్రామంగా తీర్చిదిద్దండి.

– అంబేద్కర్, జైభీం యూత్, పైడిమడుగు

బొండాల దుకాణాలు తొలగించండి



జగిత్యాల కొత్త బస్టాండ్ సర్కిల్‌లో మున్సిపల్ రోడ్డును ఆనుకుని ఏర్పాటు చేసిన కొబ్బరి బొండాల దుకాణాల వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నం. తాగి పడేసిన కొబ్బరి బొండాల వ్యర్థాలను డబ్బాల్లో కాకుండా ఇష్టారాజ్యంగా వదిలేస్తున్నారు. పందులు వాటిని చిందరవందర చేస్తున్నాయి. డ్రైనేజీల్లోకి చేరి మురుగునీరు నిలిచిపోతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. రద్దీగా ఉండే కొత్త బస్టాండ్ సర్కిల్‌లో ఒకేచోట ఐదు బొండాల షాపులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– సప్పు శ్రీనివాస్‌రావు, జగిత్యాల

క్లుప్తంగా

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారులోని కూనారం రైల్వేగేటు సమీపంలో సోమవారం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి, ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన ఆకుల మొగిళి(49) ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాలతోనే బలవన్మరణానికి పాల్పడ్డాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతుడి భార్య సమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

రాజన్న సన్నిధిలో ఒకరు..


విష్ణు మృతదేహం

సిరిసిల్లక్రైం/వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న సన్నిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన గూడూరి విష్ణు(36) సోమవారం ఆర్టీసీ బస్సులో వేములవాడ ఆలయానికి చేరుకున్నాడు. రాజన్న ఆలయ కట్టమీద వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి, అక్కడే మృతిచెందాడు. గమనించిన భక్తులు ఆలయ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. కానీ, బస్ టికెట్ చూసి, సిరిసిల్ల నుంచి వేములవాడ వచ్చినట్లు తెలియడంతో మృతుడి ఫొటోను సిరిసిల్ల సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో అతని పేరు విష్ణు అని, గతంలో సొంచాలు, ఆటో నడిపేవాడని సమాచారం అందింది. అతని తల్లిదండ్రులు చనిపోయారని, వివాహం జరిగినా, కుటుంబసభ్యులతో ఉండటం లేదని పోలీసులు తెలిపారు. మృతుడిపై ఓ హత్య కేసు ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం.

రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు


మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రభుత్వానికి సీఎమ్మార్ అప్పగించకపోవడంతో జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీం అధికారి అనిల్‌కుమార్ జగిత్యాల డీఎం హతీరాంతో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. మిల్లుతోపాటు ధాన్యం నిల్లలున్న గోదాములను తనిఖీ చేశారు. 2022–23 యాసంగిలో 73,579 క్వింటాళ్ల ధాన్యం తీసుకోగా 20,281 క్వింటాళ్లు మరాడించారని, 2023–24 వానాకాలంలో 42,570 క్వింటాళ్లు తీసుకొని, 9,531 క్వింటాళ్లు మరాడించినట్లు, 2023–24 యాసంగిలో 38,330 క్వింటాళ్లు తీసుకొని, 2,559 క్వింటాళ్లు మరాడించారని తెలిపారు. మొత్తం ధాన్యంలో 10,756 క్వింటాళ్ల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. కొంత ధాన్యం వర్షాల వల్ల చెడిపోయిందని మిల్లు యజమాని శ్రీనివాస్ చెప్పారన్నారు. తేడా వచ్చిన ధాన్యానికి సంబంధించి డబ్బులు చెల్లిస్తానని, మిగతా ధాన్యం సీఎమ్మార్ పెట్టేందుకు సెప్టెంబర్ వరకు గడువు ఉందని, ఆలోగా అప్పగిస్తానన్నారని పేర్కొన్నారు. జమ్మికుంట తహసీల్దార్ విజయ, డీటీసీఎస్ వసంతరావు, ఎఫ్ఐ వినోద్ కుమార్, జమ్మికుంట టౌన్ సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'ప్రైవేట్' చదువులందేనా?

- ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు ఉత్తమాటేనా?
- అధ్యయనం పూర్తయి పదేళ్లు గడిచినా ఫలితం లేదు
- విద్యాహక్కు చట్టం అమలైతే ఉమ్మడి జిల్లాలో 50 వేల మంది విద్యార్థులకు లబ్ధి



కరీంనగర్: పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్ల కేటాయింపు, ప్రభుత్వమే ఖర్చులు భరించి, ఉచితంగా చదువు చెప్పించాలనే నిర్ణయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల సుప్రీంకోర్టు రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయకపోవడం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడం వంటి విషయాలపై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ టీచర్ పోస్టుల భర్తీ, విద్యాహక్కు చట్టం అమలు సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు సూచించిన అంశాల అమలుకు బడ్జెట్ కేటాయింపులు తదితరాలపై సంబంధిత అధికారులతో సమీక్షించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి, విద్యాహక్కు చట్టం అమలుపై సూచనలు, సలహాలు తీసుకునేందుకు సర్కారు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అయితే, ప్రభుత్వమే కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తుందని ఒకవైపు చెబుతూనే, మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామంటుండటం విద్యాహక్కు చట్టం అమలుపై గందరగోళానికి కారణమవుతోంది. ఈ విద్యాసంవత్సరమైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులు చదివేందుకు అవకాశం లభిస్తుందో లేదో వేచిచూడాలి.

2012లోనే నివేదిక..

విద్యాహక్కు చట్టంలో భాగంగా.. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలని పదేళ్ల క్రితమే సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. కానీ, ఇంతవరకు అది అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం 8 మందితో నియమించిన కమిటీ సీట్ల కేటాయింపుపై అధ్యయనం చేసి, 2012 మే నెలలోనే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దానిపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వేలాది మంది పేద విద్యార్థులు ప్రైవేట్ చదువులకు దూరమయ్యారు.

ఫీజుల భారంతో మిన్నకున్న సర్కారు

సీట్ల కేటాయింపునకు ప్రైవేట్ యాజమాన్యాలు విముఖంగా ఉన్నాయి. ఒకవేళ పేద పిల్లలకు సీట్లు కేటాయించినా ఒలింపియాడ్, కాన్సెప్ట్, టెక్నో, ఇంటర్నేషనల్, ఈ–టెక్నో స్కూళ్ల పేరిట వసూలు చేస్తున్న వేలాది రూపాయల ఫీజులను ప్రభుత్వం చెల్లించలేని పరిస్థితి. అందుకే గతంలో పలు విద్యాసంస్థల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. కమిటీ అధ్యయనం తర్వాత చాలావరకు యాజమాన్యాలు కొంతమేర అంగీకారం తెలిపాయి. కానీ, కమిటీ ప్రభుత్వంపై ఏటా పడే పడే ఫీజుల భారాన్ని కూడా నివేదికలో పేర్కొంది. ఇది చూసి, సర్కారు మిన్నకుండిపోయింది.

1,300కు పైగా ప్రైవేట్ స్కూళ్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1,300కు పైగా ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 3 లక్షల మంది విద్యార్థులున్నారు. ఆయా విద్యాసంస్థల్లో 25 శాతం సీట్ల ప్రకారం.. 75 వేల మందికి ఉచితంగా ప్రైవేటు చదువులు చెప్పాలి. అయితే, ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకే చట్టం వర్తిస్తుందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. మధ్యలో చేరే వారికి ప్రైవేట్ చదువులు చెప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. ఫలితంగా విద్యాశాఖ చట్టం అమలైతే 45 వేల నుంచి 50 వేల మందికి లబ్ధి చేకూరనుంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. సర్కారు స్కూళ్లలో చదివే విద్యార్థులు ప్రైవేటు బడులకు తరలితే.. ఎలా? అని ప్రభుత్వం చట్టం అమలుకు వెనకడుగు వేసిందని గతంలో విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

చట్టాన్ని అమలు చేయాలి



సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకపోవడం విచారకరం. ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ము కాసేలా ప్రభుత్వాలు పని చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్నట్లు మన దగ్గర కూడా చట్టాన్ని అమలు చేయాలి.

– కె.రాణాప్రతాప్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

అక్రమ నిర్మాణం కూల్చివేత అడ్డగింత


జేసీబీ ఎక్కి ఆందోళన చేస్తున్న వెంకటేశ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణం కూల్చివేత ఉద్రిక్తతకు దారితీసింది. ఆక్రమణదారు క్రిమిసంహారమందు డబ్బాతో రెవెన్యూ అధికారులను అడ్డుకొని, ఆందోళన చేపట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. నగునూరులోని సర్వే నంబర్ 471 పోచమ్మకుంట గుట్ట ప్రాంత ప్రభుత్వ స్థలంలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల వేముండ్ల వెంకటేశ్ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా పంచాయతీ కార్యదర్శి మల్లయ్య పనులు నిలిపివేయించాడు. అయినా, ప్రహరీ నిర్మించాడన్న సమాచారంతో ఆర్ఐ రజనీకాంత్ సోమవారం మోకాపై వెళ్లి, పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన ప్రహరీని జేసీబీతో కూల్చివేయించేందుకు ప్రయత్నించగా వెంకటేశ్ క్రిమిసంహార మందు డబ్బాతో వచ్చి, అడ్డుకున్నాడు. మిగతా వారి ఇళ్లను కూల్చివేసిన తర్వాతే తన గోడను కూల్చాలన్నాడు. లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించాడు. కూల్చివేతకు వచ్చిన జేసీబీ పైకి ఎక్కి, ఆందోళన చేపట్టాడు. స్వచ్ఛందంగా ప్రహరీని తొలగించుకోవాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హెచ్చరించి, వెనుదిరిగారు. అయితే, ఈ స్థలంలో స్థానిక ప్రజాప్రతినిధుల అండతోనే పలువురు అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. వాటిని తొలగించి, పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు.

ఆమె కళ్లు సజీవం


స్వరూప (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన ముక్క స్వరూప(60) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందింది. కుటుంబసభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించడంతో ఆమె కళ్లను దానం చేయడానికి ముందుకువచ్చారు. దీంతో సంస్థ జిల్లా అధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో స్వరూప నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించారు. ఆమె భర్త కృష్ణమూర్తి, కుమారుడు–కోడలు శ్రావణ్‌కుమార్–శిరీషలకు ఫౌండేషన్ నిర్వాహకులు అభినందించారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్


సాంబశివరావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావును సస్పెండ్ చేస్తూ మల్టీజోన్–1 ఇన్‌చార్జి ఐజీ సుధీర్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల సాంబశివరావుపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ దర్యాప్తు చేసి నివేదికను అందజేశారు. అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

మెట్‌పల్లి(కోరుట్ల): ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలిక ఏడాది క్రితం హైదరాబాద్‌లో ఉండగా నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని బచ్చన్‌పల్లికి చెందిన పృథ్వీ రాజ్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత ప్రేమిస్తున్నానని చెప్పి, పెళ్లి చేసుకుందామని అతను అడగగా.. అంగీకరించలేదు. ఆమె తల్లి వద్దకు వెళ్లి విషయం చెప్పగా.. ఒప్పుకోలేదు. దీంతో బాలికను బలవంతంగా బచ్చన్‌పల్లిలోని తన ఇంటికి తీసుకెళ్లి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఓ ఆలయంలో పెళ్లి చేసుకొని, తీవ్రంగా వేధించాడు. దీంతో ఆమె పారిపోయి తల్లి వద్దకు వచ్చింది. అయినా, తరచూ ఫోన్ చేస్తూ బెదిరింపులకు గురిచేస్తుండటంతో గత మే 31న పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. అప్పటినుంచి పరారీలో ఉన్న పృథ్వీరాజ్‌ను సోమవారం ఇబ్రహీంపట్నంలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

కొత్త చట్టాలు.. తొలిరోజు ఐదు కేసులు

- జగిత్యాల, సిరిసిల్లలో రెండు చొప్పున..
- కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో ఒకటి నమోదు

జగిత్యాల క్రైం: కేంద్రం ప్రభుత్వం న్యాయశాఖలో కొత్తగా తీసుకొచ్చిన చట్టాల్లో భాగంగా తొలిరోజు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు రెండు కేసులు నమోదయ్యాయి. చెర్లపల్లికి చెందిన ఆది గంగారెడ్డి తన వ్యవసాయ భూమిలోకి నీరు వదలిపెట్టాలని దీటి లావణ్యపై ఫిర్యాదు చేశాడు. దీనిపై తొలి కేసు నమోదైంది. అలాగే, దీటి గంగారెడ్డి తనను అసభ్యపదజాలంతో దూషిస్తూ, బెదిరించాడని దీటి లావణ్య ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై..

కరీంనగర్ క్రైం: మానకొండూర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మానేరు వాగు నుంచి ట్రాక్టర్‌లో కరీంనగర్‌లోని ముకరంపురకు ఇసుక తరలిస్తుండగా తెలంగాణ చౌక్ వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిపై..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని రాళ్లపేటకు చెందిన సోమ లక్ష్మి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గణాది దేవేందర్‌పై గతంలో కేసు నమోదైంది. రిమాండ్ అనంతరం ఇంటికి వచ్చిన అతను లక్ష్మిని బెదిరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రిపై తనయుడి దాడి..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భారత న్యాయ సంహితలో భాగంగా ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో తొలి కేసు నమోదైంది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పదిరకు చెందిన సూరం నర్సయ్య కూలి పనులు చేస్తూ జీవిస్తుండగా, అతని కొడుకు శ్రీనివాస్ జులాయిగా తిరుగుతున్నాడు. సోమవారం పనికి వెళ్లొచ్చిన తండ్రిని కొడుకు డబ్బులు ఇవ్వాలంటూ బెదిరించాడు. ఇవ్వకపోవడంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాస్ తన తండ్రిపై కర్రతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొత్త చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

- ఎస్సారెస్పీలోకి 0.2 టీఎంసీల వరద నీరు


ఎస్సారెస్పీలోకి వస్తున్న వరద

జగిత్యాల అగ్రికల్చర్: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఎత్తివేశారు. వాటిని జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు నాలుగు నెలలపాటు తెరిచే ఉంచనున్నారు. దీంతో, బాబ్లీ ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో కురిసే వరద నీరు ఆగకుండా నేరుగా ఎస్సారెస్పీలోకి రానుంది. దీనివల్ల ఎస్సారెస్పీ నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బాబ్లీ నుంచి 0.2 టీఎంసీల వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీ నీటి మట్టం 10.474 టీఎంసీలుగా ఉంది. కార్యక్రమంలో పోచంపాడు ఎస్సారెస్పీ అధికారులు శ్రీనివాస్ గుప్తా, చక్రపాణి, వంశీ, మహారాష్ట్ర అధికారి బన్సోడ్, సమన్వయకర్తలు వెంకటేశ్వర్లు, సతీశ్ పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో డాక్టర్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే


చైర్మన్ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు, సీఏలు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో నేషనల్ డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మనుషుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు, ఆర్థిక వ్యవస్థను కాపాడటంలో సీఏలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. కోవిడ్–19 సమయంలో వైద్యుల సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. పేదలకు వైద్యసేవలందిస్తూ సేవాభావం చాటాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పారమిత'లో వైద్యుల దినోత్సవం..


జ్ఞాపిక అందిస్తున్న చైర్మన్ ప్రసాదరావు

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల, మంకమ్మతోటలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు పలువురు వైద్యులను సన్మానించారు. డాక్టర్లు దేవుళ్లతో సమానమని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. వైద్య శిబిరం నిర్వహించి, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, హన్మంతరావు, రమణ, ప్రసాద్, వినోద్ రావు, ప్రిన్సిపాల్ కవిత ప్రసాద్, గోపీకృష్ణ, నాగరాజు, రాము, సమత, నాజిష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి ఇంట్లో డీఎం విందు?

- సోషల్ మీడియాలో వైరల్


వైరల్ అవుతున్న ఫొటో

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ సంస్థకు చెందిన ఓ ఉద్యోగి ఇంట్లో విందు చేసుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో మద్యం తాగడం వ్యక్తిగతమైన విషయమైనప్పటికీ ఉద్యోగుల ఇళ్లలో ఇలా చేయడం ఇబ్బందికరమని పలువురు పోస్టులు పెడుతున్నారు. దీనిపై డీఎంను వివరణ కోరగా గతేడాది జూలైలో ఉద్యోగి ఇంటికి తీజ్ ఉత్సవాలకు వెళ్లానని, ఎలాంటి మద్యం తీసుకోలేదని తెలిపారు. 10 నిమిషాలు మాత్రమే ఉండి వచ్చానని, ఎవరో కావాలనే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

చొప్పదండిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

- 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష అపహరణ

చొప్పదండి: పట్టణంలోని తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. చొప్పదండి వివేకానంద చౌరస్తా సమీపంలో ఉండే గుర్రం చంద్రకళ భర్త 16 ఏళ్ల క్రితం మృతిచెందాడు. ఇద్దరు కుమారులు అమెరికాలో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమె గత నెల 26న శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుపతి వెళ్లింది. స్వామివారి దర్శనం అనంతరం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. 30న మధ్యాహ్నం తన ఇంటి పక్కనున్న బంధువు వరలక్ష్మిని ఒకసారి ఇంటికి వెళ్లి, చూడాలని కోరింది. ఆమె వెళ్లి పరిశీలించగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. విషయాన్ని చంద్రకళకు చెప్పడంతో సోమవారం ఇంటికి వచ్చింది. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాలు ధ్వంసమై, సామగ్రి చిందరవందరగా పడి ఉంది. 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష, రెండు ఐప్యాడ్ చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రంగపేట హైస్కూల్లో దొంగతనం


పాఠశాలలో పగులగొట్టిన కోడిగుడ్లు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రంగపేట ఉన్నత పాఠశాలలో దొంగలు పడ్డారని గ్రామస్తులు తెలిపారు. స్కూల్లో ఏర్పాటు చేసిన లైట్లు, మైక్ సెట్‌ను చోరీ చేశారన్నారు. వారి వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి దొంగలు పాఠశాలలోకి ప్రవేశించిన దొంగలు వరండాలో మద్యం సేవించారు. సీసాలను, స్కూల్ ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రంలోని కోడిగుడ్లను పగులగొట్టారు. రూ.30 వేల విలువైన సోలార్ లైట్లు, స్కూల్ గది తలుపులు పగులగొట్టి, మైక్ సెట్‌ను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలను శుభ్రం చేయడానికి వచ్చిన సిబ్బంది ఈ విషయమై గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్కూల్‌కు చేరుకొని, విచారణ చేపట్టారు. అధికారులు స్పందించి, పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎములాడ రాజన్నకు పోటెత్తిన భక్తులు

వేములవాడ: రాజన్నను సోమవారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈనెల 5 నుంచి అమావాస్య, ఆషాఢమాసం ఆరంభమవుతుండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు బి.శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు.


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

అనారోగ్య కారణాలతో మహిళ బలవన్మరణం

చొప్పదండి: అనారోగ్య కారణాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. చొప్పదండి మండలంలోని రుక్మాపూర్‌కు చెందిన పెంటల రాజమ్మ(55) భర్త నుంచి విడిపోయింది. కూలీ పని చేసుకుంటూ జీవిస్తోంది. రెండేళ్ల క్రితం చొప్పదండిలోని పాత వెదురుగట్ట రోడ్డులో గల దుబ్బల మీద ఇందిరమ్మ కాలనీ వద్ద ఇల్లు నిర్మించుకుంది. ఆమెకు ఒక కూతురు కాగా, వివాహం జరిపించింది. ఈ క్రమంలో రాజమ్మ 2 నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆమె కూతురు పలు ఆస్పత్రులకు తీసుకెళ్లి, చికిత్స చేయించినా నయం కాలేదు. గత 30న తల్లిని ఇంట్లో దింపి, వెళ్లిపోయింది. సోమవారం ఉదయం రాజమ్మ కనిపించకపోవడంతో స్థానికులు ఆమె కూతురుకు సమాచారం అందించారు. సమీపంలో వెతకగా, వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. మృతురాలి కూతురు న్యాతరి వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరీంపేటలో యువకుడు..


సాయిరాం (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కరీంపేటకు చెందిన గుర్రం సాయిరాం (22) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి, గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గుర్రం నాగరాజు–భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కొడుకు సాయిరాం స్నేహితులతో కలిసి లఘుచిత్రాల్లో నటించేవాడు. కొంతకాలంగా కరీంనగర్‌లోని వైన్స్‌లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం ఓ మహిళతో సహజీవనం చేసినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి వరకు వైన్స్‌లో పనిచేసిన అతను సోమవారం తెల్లవారు జామున కరీంపేటలోని ఇంటికి వచ్చి, క్రిమిసంహారక మందు తాగి, మృతిచెందాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీడీనగర్‌లో వృద్ధుడు..

పాలకుర్తి(రామగుండం): మండలంలోని జీడీనగర్‌కు చెందిన గోల్కొండ ఎల్లయ్య(77) ఆత్మహత్య చేసుకున్నాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం.. ఎల్లయ్య మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ఆయనను కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై, తాడు తీసుకొని, బయటకు వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. స్థానికులు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో మృతుడి కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- స్కూల్‌కు బైక్ తీసుకెళ్లనివ్వడం లేదని ఆత్మహత్యాయత్నం


మణిదీప్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోసానిపేటకు చెందిన మారు మణిదీప్(14) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మారు రాజ్‌కుమార్–లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు మణిదీప్ కోరుట్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కు బైక్ తీసుకెళ్తానంటే తల్లి అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురై, గత నెల 24న క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని 27న తల్లిదండ్రులకు చెప్పాడు. వారు మణిదీప్‌ను జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.